క్లుప్తంగా

వ్యాపార విస్తరణకు ఫిక్కీ సమావేశాలు దోహదం



లబ్బీపేట(విజయవాడతూర్పు): యుఏఈ ద్వారా ప్రపంచ వ్యాపార విస్తరణను ప్రోత్సహించడానికి విజయవాడలో ఫిక్కీ బీ2బీ సమావేశాలు రెండు రోజుల పాటు విజయవంతంగా నిర్వహించారు. నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన ఈ సమావేశాలు యుఏఈలోని షార్జా ప్రభుత్వ ఎయిర్‌పోర్ట్ ఇంటర్నేషనల్ ఫ్రీ జోన్(సైఫ్ జోన్) భాగస్వామ్యంతో నిర్వహించారు. ఈ సందర్భంగా భారత వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య(ఫిక్కీ) యుఏఈ ద్వారా ప్రపంచ మార్కెట్లలోకి భారతీయ వ్యాపారాలు విస్తరించడంలో సహాయపడే లక్ష్యంతో ఈ సమావేశాలు నిర్వహించినట్లు ఫిక్కీ ఆంధ్రప్రదేశ్ ప్రతినిధి ఎం.ప్రభాకరరావు తెలిపారు. ఈ సమావేశాల్లో విస్తృత శ్రేణిలో మధ్యప్రాచ్య, ఆఫ్రికా, మధ్య ఆసియా, రష్యాలో వాణిజ్యం, వ్యాపార అవకాశాలను గురించి అవగాహన కలిగించినట్లు తెలిపారు.

ఉచిత యోగా శిక్షణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ సాయిబాబా కాలనీ రాజీవ్‌గాంధీ వీధి స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ కార్యాలయంలో ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ట్రస్టీ చొప్పరపు నారాయణరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 6.30 నుంచి 7.30 గంటల వరకు యోగా శిక్షణ తరగతులు జరుగుతాయని చెప్పారు. మధురానగర్ పరిసర ప్రాంత వాసులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర సమాచారం కోసం 92464 88678 నంబర్‌ను సంప్రదించాల్సిందిగా ఆయన సూచించారు.

ఏపీ ఎన్జీఓ నేతలను కలిసిన పారామెడికల్ నాయకులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇటీవల ఏపీ ఎన్జీఓ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన ఎ. విద్యాసాగర్, డి.వి. రమణలను ఏపీ పారామెడికల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జీ జోసఫ్, మాధవరపు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తాము ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ తీసుకునే నిర్ణయాలకు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తున్న ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు విద్యాసాగర్, రమణలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సీహెచ్ సూర్యారావు, రామకృష్ణ, గంటా ప్రతాప్ కుమార్ పాల్గొన్నారు.

కాలువల్లో వ్యర్థాల తొలగింపు



సాక్షి ఎఫెక్ట్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎట్టకేలకు నగరపాలక సంస్థ అధికారులు స్పందించారు. కాలువల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు పనులను మంగళవారం చేపట్టారు. నగరంలోని కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి మురికి కూపాలుగా మారాయి. ఈ విషయాలను వివరిస్తూ సాక్షి కాలుష్య కోరల్లో కాలువలు శీర్షికన కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన అధికారులు కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించడంతో పాటు కాలువ గట్లను శుభ్రం చేశారు.

దాసాంజనేయునికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం దాసాంజనేయస్వామివారి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రీతికరమైన సిందూరం, ఆకు పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వాహనచోదకులు వాహన పూజలు చేయించుకున్నారు.

యాసిడ్ తాగి వృద్ధుడి ఆత్మహత్య

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): బాత్‌రూమ్‌లోని యాసిడ్ తాగి అనుమానాస్పదంగా వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై మంగళవారం ఎస్ఎన్‌పురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గుడ్ల సూర్యనారాయణ (66) మిక్సర్ బండి నడుపుకొంటూ భార్యతో కలసి బావాజీపేట మొదటి లైన్‌లో నివాసముంటున్నాడు. సోమవారం మధ్యాహ్నం బాత్‌రూమ్‌లోకి వెళ్లి అక్కడే ఉన్న యాసిడ్ తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. ఆయన్ను గమనించిన భార్య స్థానికుల సాయంతో ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనపై ఎస్ఎన్‌పురం పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

పండ్ల మార్కెట్‌తో పరేషాన్

- కేదారేశ్వరపేట పండ్ల మార్కెట్ వద్ద నిత్యం స్తంభిస్తున్న ట్రాఫిక్
- రోడ్లపైనే ఎగుమతులు, దిగుమతులు



అయోధ్యనగర్‌లో రోడ్డును సగానికి ఆక్రమించిన పండ్ల వ్యాపారులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఆసియా ఖండంలోనే అతిపెద్ద పండ్ల మార్కెట్‌గా ప్రసిద్ధి చెందిన పండ్ల మార్కెట్‌ను ఐదు దశాబ్దాల క్రితం కేదారేశ్వరపేట వద్ద ఏర్పాటు చేశారు. అప్పట్లో ఇది నగరానికి మారుమూల ప్రాంతంగా ఉండేది. దీంతో ఇతర రాష్ట్రాల నుంచి వివిధ రకాల పండ్ల లోడుతో వచ్చే భారీ వాహనాల రాకపోకలకు అనువుగా ఈ స్థలం ఉండేది. కాలక్రమేణ నగరం విస్తరించడంతో కేదారేశ్వరపేట నగరంలో ఒక ప్రధాన ప్రాంతంగా మారింది. దీంతో చుట్టు పక్కల వేలాది సంఖ్యలో గృహాల నిర్మాణాలు, అపార్ట్‌మెంట్లు వెలిశాయి. ఈ క్రమంలో ట్రాఫిక్ రద్దీ కూడా పెరగడంతో నగరపాలకసంస్థ అధికారులు ఇక్కడి పండ్ల మార్కెట్‌ను తరలించే దిశగా చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా నున్నలో 1998లో 23 ఎకరాల విస్తీర్ణంలో భారీ వాహనాల రాకపోకలకు విశాలవంతమైన రోడ్లు, అన్ని మౌలిక సదుపాయాలతో దుకాణాలను నిర్మించడం జరిగింది.

ట్రాఫిక్ నివారణ చర్యలు శూన్యం

ప్రతి రోజూ రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేసుకోవడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని వాహనదారులు చెబుతున్నారు. ముఖ్యంగా కేదారేశ్వరపేట పండ్ల మార్కెట్‌కు వచ్చే భారీ వాహనాల వల్ల ద్విచక్రవాహనం వెళ్లేందుకు కూడా కష్టపడాల్సి వస్తోందని వాపోతున్నారు. కనీసం తమ వాహనాలకు పెట్రోలు నింపుకొనేందుకు బంకులకు వెళ్లేందుకు కూడా వ్యాపారాలు దారి లేకుండా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సీకే రెడ్డి రోడ్డులో ట్రాఫిక్ కష్టాలను తొలగించాలని కోరుతున్నారు.

తరలేందుకు నిరాకరిస్తున్న వ్యాపారులు

దశాబ్దాలుగా కేదారేశ్వరపేటలోనే వ్యాపారాలు నిర్వహిస్తున్న పండ్ల వ్యాపారులు నగరానికి శివారు ప్రాంతమైన నున్నకు తరలివెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. ఇప్పటికే కొంతమందికి అక్కడ దుకాణాలు కేటాయించడంతో తరలివెళ్లారు. అధికశాతం మంది వ్యాపారులు మాత్రం వెళ్లేందుకు ఇష్టపడటం లేదు. అక్కడకు వెళ్తే తమకు వ్యాపారాలు ఉండవని, అక్కడ తమకు కేటాయించిన దుకాణాలు కొందరి చేతుల్లోనే ఉన్నాయని చెప్పి వ్యాపారులు వెళ్లేందుకు నిరాకరిస్తున్నారు.

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

కేదారేశ్వరపేట పండ్ల మార్కెట్‌కు నిత్యం భారీ వాహనాల రాకతో సీకే రెడ్డి రోడ్డులో ట్రాఫిక్ రద్దీ నెలకుంటుంది. ముఖ్యంగా కేదారేశ్వరపేట సెంట్రల్ వేర్ హౌస్ నుంచి అయోధ్యనగర్ వరకు ట్రాఫిక్ నిలిచిపోతుంది. ముఖ్యంగా మామిడి సీజన్‌లో ఈ ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటుంది. పగలు, రాత్రి తేడా లేకుండా లారీలు రోడ్లపైనే ఉంచి ఎగుమతులు, దిగుమతులు చేస్తుండటంతో మిగతా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అయోధ్యనగర్ ప్రాంత ప్రజలు తమ వాహనాలను నివాసాల వరకు తీసుకువెళ్లే అవకాశం కూడా లేకుండా రోడ్లపైనే తోపుడు బండ్లు, బడ్డీలను, రోడ్డుకు అడ్డంగా లారీలను నిలిపి ఉంచుతున్నారని స్థానికులు వాపోతున్నారు. మరోవైపు ఈ రోడ్డులోని పెట్రోలు బంకు, షాపింగ్ మాల్స్, ఇతర కమర్షియల్ షాపులు, బ్యాంక్ ఏటీఎం సెంటర్లు, కళాశాలల ముందు లారీలతో సరుకులు రోడ్డు మీదే దిగుమతులు చేసుకోవడంతో వినియోగదారులు వెళ్లే అవకాశం కూడా ఉండటం లేదని వాటి యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన మల్లాది విష్ణు

ఆత్మీయ కలయిక

మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మల్లాది విష్ణుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నియోజకవర్గ పరిస్థితులపై చర్చించారు. – మధురానగర్(విజయవాడసెంట్రల్)

ఘనంగా మల్లాది విష్ణు జన్మదిన వేడుకలు



విష్ణు, జోగి రమేష్, వెలంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీ రుహుల్లాను గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు జన్మదిన వేడుకలు మంగళవారం జనహిత సదనంలో ఘనంగా జరిగాయి. మాజీ మంత్రులు జోగి రమేష్, వెలంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా ఈ వేడుకల్లో పాల్గొని మల్లాది విష్ణుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనుక్షణం ప్రజలకు అండగా తోడు నీడుగా ఉండే మల్లాది విష్ణు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. మల్లాది విష్ణు మాట్లాడుతూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులు భారీ గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు రవిచంద్ర, కార్యకర్తలు పాల్గొని మల్లాది విష్ణుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

వృద్ధాశ్రమంలో జన్మదిన వేడుకలు

పాయకాపురం(విజయవాడరూరల్): వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తన జన్మదిన వేడుకలను మంగళవారం రాజీవ్‌నగర్‌లోని వృద్ధాశ్రమంలో నిరాడంబరంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆశ్రమంలోని వృద్ధులకు నూతన వస్త్రాలను పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 63వ డివిజన్ అధ్యక్షుడు పసుపులేటి యేసు, సెంట్రల్ నియోజకవర్గం యూత్ ప్రెసిడెంట్ మాతా మహేష్, యూత్ ప్రతినిధి కంది రమణారెడ్డి, ఎస్సీ సెల్ ప్రతినిధి సుమో రాజు, బీసీ సెల్ అధ్యక్షుడు ఆర్.యేసు, మహిళా అధ్యక్షురాలు ఎం.రాజేశ్వరి, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు. ముందుగా పార్టీ కార్యకర్తలు బైక్ ర్యాలీతో మల్లాది విష్ణుకి స్వాగతం పలికారు.

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పుట్టిన రోజు సందర్భంగా గవర్నర్‌పేటలోని లీలా గ్రాండ్ రెసిడెన్సీ లాడ్జీ సమీపంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ట్రేడ్ యూనియన్ నాయకులు శెనగశెట్టి హరిబాబు, పసుపులేటి కోటేశ్వరరావు, వాసు, కోలా నాగాంజనేయులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల వినియోగంతో జీవితం అంధకారం



సింగ్‌నగర్‌లో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు, ఫాదర్ మర్రెడ్డి తదితరులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు సేవించడం వల్ల జీవితం అంధకారంగా మారుతుందని అజిత్‌సింగ్ నగర్ సీఐ బీహెచ్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో సింగ్ నగర్ వివేకానంద సెంటినరీ హైస్కూల్, న్యూ రాజరాజేశ్వరీ పేటలోని కేర్ అండ్ షేర్ మున్సిపల్ హైస్కూల్స్‌లో మంగళవారం ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. దీనిలో పాల్గొన్న సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నేడు సమాజంలో యువత పెడద్రోవ పట్టడంలో ప్రధానమైనవి మాదకద్రవ్యాలని పేర్కొన్నారు. చిన్నపిల్లలు కూడా మాదకద్రవ్యాలను తీసుకునేందుకు అలవాటు పడుతున్నారని చెప్పారు. వీటివల్ల వారు దొంగతనాలు, దోపిడీలు, నేరాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. చిన్నారులు, యువత చదువులు, ఉద్యోగాలపై దృష్టిపెట్టాలని సూచించారు. అనంతరం మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరించారు. నవజీవన్ బాలభవన్ ఫాదర్ మర్రెడ్డి, ఎస్ఐ రమ్యశ్రీ, కేర్ అండ్ షేర్ స్కూల్ హెచ్ఎం నాంచారయ్య, వివేకానంద సెంటినరీ హైస్కూల్ హెచ్ఎం నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాశీవిశ్వేశ్వర ఆలయం ఈఓగా గంగాధరరావు



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని శ్రీకాశీవిశ్వేశ్వర ఆలయ ఈఓగా గంగాధరరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామలోని శివాలయంలో ఈఓగా పని చేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వారికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాల కల్పన దిశగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. నగరంలోనే ఎంతో ప్రసిద్ధి చెందిన ఈ ఆలయం అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

ఏకేటీపీ స్కూల్ హెచ్‌ఎంగా ఉమర్ ఆలీ



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు(ఏకేటీపీ) మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎంగా షేక్ ఉమర్ ఆలీ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. భవానీపురంలోని ఎస్ఎంఏ ఖుద్దుస్ మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎంగా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోనే ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న ఏకేటీపీ పాఠశాలలో ఉపాధ్యాయుల సహకారంతో భవిష్యత్తులో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా కృషిచేస్తానని తెలిపారు.

పరిశోధనలతో బోధనలో నాణ్యత



పుస్తకావిష్కరణ చేస్తున్న శ్రీనివాస విక్రమ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): అధ్యాపకులు పరిశోధన దృక్పథాన్ని పెంచుకోవడం ద్వారా బోధనలో నాణ్యత పెరుగుతుందని విక్రమ్ పబ్లిషర్స్ అధినేత రావిక్రింది శ్రీనివాస విక్రమ్ పేర్కొన్నారు. కేబీఎన్ పబ్లికేషన్స్ ప్రచురించిన 'రీసెర్చ్ మెథడాలజీ అండ్ ఐపీఆర్' పుస్తకావిష్కరణ సభ మంగళవారం కళాశాల ప్రాంగణంలో జరిగింది. పుస్తకావిష్కరణ చేసిన విక్రమ్ మాట్లాడుతూ విద్యారంగంలో నూతన ఆవిష్కరణలు, సాంకేతిక విప్లవాన్ని ఉపయోగించుకుని బోధన నైపుణ్యాలు పెంచుకోవడం, పరిశోధన పత్రాలు రాయడం వంటి అంశాలను సమగ్రంగా ఈ పుస్తకంలో వివరించినట్లు తెలిపారు. మేధో సంపత్తి హక్కులు పొందే విషయంలో అధ్యాపకులు చాలా వెనుకబడి ఉన్నారని, ఈ క్రమంలో వారిలో అవగాహన పెంచేందుకు ఈ పుస్తకం బాగా ఉపయోగపడుతుందని చెప్పారు. పరిశోధన, మేధో సంపత్తి హక్కులు పొందడం అధ్యాపకుల నైపుణ్యాలకు గీటురాయి అన్నారు. పుస్తక రచయిత, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ పరిశోధనకు అంశాన్ని ఎంపిక చేసుకోవడం నుంచి భవిష్యత్ పరిశోధనలకు చేయాల్సిన సూచనల వరకు ప్రతి అంశాన్నీ సూక్ష్మ వివరణలతో సహా ఈ పుస్తకంలో రాసినట్లు చెప్పారు. సెక్రటరీ టి.శ్రీనివాసు మాట్లాడుతూ రచయితలను అభినందించి, సత్కరించారు. కార్యక్రమంలో సహ రచయితలు డాక్టర్ ఒ.శైలజ, డాక్టర్ కె.కిరణ్ కుమార్, రీసెర్చ్ సెల్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సాయికృష్ణ పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేట అట్టారత్తయ్య వీధిలోని ఓ భవనంలో నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై పోలీసులు దాడి చేశారు. భవనం 4వ అంతస్తులో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న సమాచారంతో గవర్నర్‌పేట సీఐ అడపా నాగమురళీ సిబ్బందితో కలసి సోమవారం అర్ధరాత్రి దాడి చేశారు. ముగ్గురు విటులు, నలుగురు మహిళలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వీరిని గవర్నర్‌పేట పోలీసు స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేశారు. బాధిత మహిళలను ప్రశ్నించగా ఆంధ్రాజు బాలకృష్ణ అనే వ్యక్తి వ్యభిచార గృహం నడుపుతున్నట్లు చెప్పారని సీఐ తెలిపారు. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్, కర్ణాటక రాష్ట్రాల నుంచి మహిళలను తీసుకువచ్చి వ్యభిచార గృహం నడుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. నిర్వాహకులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలి

సీఐ ఎస్.వి.వి లక్ష్మీనారాయణ



వైద్య పరీక్షలను పర్యవేక్షిస్తున్న సీఐ లక్ష్మీనారాయణ

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఆరోగ్యమే మహా భాగ్యం అని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటేనే దైనందిన జీవితంలో లక్ష్యాలను సాధించుకోవచ్చని ఎస్ఎన్‌పురం సీఐ ఎస్.వి.వి లక్ష్మీనారాయణ అన్నారు. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఎస్ఎన్‌పురం పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పోలీసు శాఖ ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో వారి వారి విధులు నిర్వర్తించుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నవారు వ్యక్తిగత ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ సకాలంలో వైద్య చికిత్సలు తీసుకోవాలని కోరారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో బీపీ, షుగర్, కంటి వైద్య నిపుణులు, దంత నిపుణులు, జనరల్ మెడిసిన్ విభాగాల వైద్యులతో అన్ని పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, పలు విభాగాల వైద్యులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో జీవితాలు చిత్తు

ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ



సదస్సులో మాట్లాడుతున్న ఈగల్ టీమ్ ఐజీ ఆకే రవికృష్ణ, వేదికపై ప్రిన్సిపాల్ ఏవైరావు, డీసీపీ సరిత తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): డ్రగ్స్‌తో యువత తమ జీవితాలను చిత్తు చేసుకోవద్దని ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ సూచించారు. ఈగల్ విభాగం ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా మంగళవారం ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలలో నషా ముక్త్ భారత్ అవగాహన కార్యక్రమం జరిగింది. సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆకే రవికృష్ణ మాట్లాడుతూ వైద్య విద్యను అభ్యసించే వారు మాదక ద్రవ్యాల బారిన పడకుండా జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల వినియోగం వంటి విష సంస్కృతికి బానిసలుగా కావొద్దన్నారు. ఎన్టీఆర్ జిల్లా డీసీపీ కేజీవీ సరిత మాట్లాడుతూ మాదక ద్రవ్యాల జోలికి పోకుండా యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలపాటి ఏడుకొండలరావు మాట్లాడుతూ వైద్య కళాశాలలో డ్రగ్స్‌ను నిషేధించడంతో పాటు, విద్యార్థులకు తరచూ అవగాహన కలిగిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈగల్ టీమ్ ఎస్పీ నగేష్‌బాబు, సైకియాట్రిక్ విభాగాధిపతి రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మాసశివరాత్రి పూజలు



శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో స్వామివారు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలోని మరకత శివలింగానికి మంగళవారం మాసశివరాత్రి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వయంగా మరకత శివలింగానికి అన్నాభిషేకం చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాలను మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి, కోశాధికారి మండలపర్తి సత్యశ్రీహరి పర్యవేక్షించారు. అలాగే శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారి ఆలయం, అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో ప్రత్యేక పూజలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైఎస్సార్ సీపీలోకి 50 మంది చేరిక



పార్టీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు జన్మదిన వేడుకల్లో మంగళవారం 63వ డివిజన్ సుందరయ్యనగర్‌కు చెందిన 50 మంది కార్యకర్తలు పార్టీలో చేరారు. క్లస్టర్ ప్రెసిడెంట్ పసుపులేటి యేసు, వాణి ఆధ్వర్యంలో 50 మంది పార్టీలో స్వచ్ఛందంగా చేశారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు వైఎస్సార్ సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మల్లాది విష్ణు మాట్లాడుతూ సమన్వయంతో పనిచేసి ప్రజలకు అండగా ఉండటంతో పాటు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం మల్లాది విష్ణు భారీ కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

రంగుల తొండ... భలే అందగుండ..!



ప్రకృతిలోని వర్ణాలన్నీ తన మేనిపైనే పరుచుకున్నట్టుంది కదూ ఈ తొండను చూస్తుంటే... ప్రకృతి అందాల నడుమ పూలచెట్లపై తారట్లాడుతూ ఆ అందాలన్నీ తనలో ఇముడ్చుకుని దివ్య తేజస్సుతో మెరిసిపోతోంది కదూ...మంగళవారం చల్లని సాయంత్రం వేళ విజయవాడ నగరంలో కనిపించిన దృశ్యమిది.

– లక్ష్మీ పవన్, సాక్షి ఫొటోగ్రాఫర్ విజయవాడ

